ప్రజల మాట ప్రగతి బాట

# చెన్నూర్ నియోజకవర్గం

# క్రీడా పోటీలతో స్నేహాభావం

- గురుకుల విద్యాలయాల డిప్యూటీ కార్యదర్శి డీ వెంకటలక్ష్మి
- చెన్నూర్‌లో జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వాలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ కార్యదర్శి డీ వెంకటలక్ష్మి

చెన్నూర్, అక్టోబర్ 13: క్రీడా పోటీలతో స్నేహాభావం పెంపొందుతుందని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల డిప్యూటీ కార్యదర్శి డీ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ గురుకుల (బాలికల) పాఠశాలల విద్యార్థినుల కాళేశ్వరం జోనల్ స్థాయి క్రీడా పోటీలు చెన్నూర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ (బాలికల) పాఠశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలు నిత్యజీవితంలో చాలా అవసరమని, వీటితో స్నేహాభావం పెంపొందుతుందని తెలిపారు. శ్రారీరక ధృడత్వం, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ఇలాంటి పోటీల్లో ఉపయోగపడతాయన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల ఆదిలాబాద్ రీజియన్ కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి మాట్లాడుతూ విద్యార్థినులు ఇలా పాఠశాలలు, జోనల్ స్థాయిల్లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. ఈ పోటీల్లో కాళేశ్వరం జోన్‌కు సంబంధించి 15సాంఘిక సంక్షేమశాఖ గురుకుల (బాలికల) పాఠశాలలకు చెందిన 1,275 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. క్రీడా పోటీల ప్రారంభానికి ముందు క్రీడాకారులు పరేడ్ నిర్వహించారు. పోటీల్లో భాగంగా విద్యార్థులకు అండర్ 14,17,19 విభాగాల్లో పరుగు పెందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, జావలిన్ త్రో లాంటి అథ్లెటిక్స్ పోటీలతో పాటు ఖోఖో, కబడ్డీ వాలీబాల్, క్యారం లాంటి క్రీడా పోటీలు నిర్వహించారు.

**పోటీల్లో విజేతలు**

అండర్ 14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఎం అలేఖ్య (లక్షెట్టిపేట) ప్రథమ, ఎం వేదాంశిక (ములుగు) ద్వితీయ, టీ లక్ష్మి (సిర్పూర్-టీ) తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. అండర్-17విభాగంలో మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో డీ రాణి (చిట్యాల) ప్రథమ, ఏ ఆశ్రిత (లక్షెట్టిపేట) ద్వితీయ, ఎం మౌనిక (ములుగు) తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. అండర్-19 మూడు కిలో మీటర్ల పరుగు పందెంలో ఏ అర్చన (నందిమేడారం) ప్రథమ, మయూరి (మందమర్రి) ద్వితీయ, పీ పూజిత (కాగజ్‌నగర్) తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, పాఠశాల ప్రిన్సిపాల్ రాజమణి, కాళేశ్వరం జోన్ పరిధిలోని గురుకుల పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**క్రీడాకారులకు జెర్సీల పంపిణీ**

జోనల్ స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్ ప్రారంభ కార్యక్రమానికి అంజనీపుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవిలు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు జెర్సీలు, క్యాప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పరిమల, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



మార్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు



క్రీడాకారులకు అందజేసిన జెర్సీలతో అంజనీపుత్ర చైర్మన్, ఎండీ

## బెల్ట్‌షాప్‌లపై పోలీసుల దాడి

- లక్ష విలువ గల మద్యం స్వాధీనం, కేసుల నమోదు



బెల్ట్‌షాప్ వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్‌ఐ చంద్రకుమార్

మందమర్రి, అక్టోబర్ 13: మందమర్రి పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ దుకాణాలపై పోలీసులు దాడి చేశారు. పట్టణ ఎస్‌ఐ చంద్రకుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న రెండు బెల్ట్ దుకాణాలపై దాడి చేసి లక్షా 10 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ ఏరియాలో బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న రాములమ్మ వద్ద 57 వేల విలువైన మద్యం, యాపల్ ఏరియాలో బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న దండెవేన ఐలయ్య వద్ద రూ.52 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు. రాములమ్మ, ఐలయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## 15న సంస్మరణ సభ

శ్రీరాంపూర్, అక్టోబర్ 13 : ఈ నెల 15న ఆదివారం నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రజాకవి గద్దర్, లౌకిక ప్రజాస్వామిక వాది జహీర్ అలీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు భారత్ బచావో జిల్లా కన్వీనర్ ఒడ్డెపెల్లి మనోహర్, సామాజిక న్యాయ వేదిక జిల్లా కన్వీ నర్ రంగు రాజేశం పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గద్దర్, జహీర్ అలీఖాన్ సంస్మరణ సభకు ప్రజాస్వామికులు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. గద్దర్ నిత్యం లౌకిక ప్రజాస్వామిక హక్కుల కోసం ఉద్యమించారని చెప్పారు. మతోన్మాద రాజకీయ శక్తులకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. గద్దర్, జహీర్‌ఖాన్‌లాంటి మహోన్నత వ్యక్తుల ఆశయాల సాధన కోసం ప్రజాస్వామికవాదులు ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో భారత్ బచావో నాయకులు సమ్ము రాజయ్య, నాయకులు మల్లయ్య, గుజ్జ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జ్వరంతో వివాహిత మృతి

జైపూర్, అక్టోబర్ 13: మండలంలోని రామారావుపేట గ్రామపంచాయతి పరిదిలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన కామెర రుచిత (22) శుక్రవారం డెంగీతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బపల్లికి చెందిన కామెర సంతోష్‌కుమార్‌కు రుచితకు ఏడాది క్రితం వివాహం జరిగింది. 12 రోజుల క్రితం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోంలో రుచిత బాబుకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి రుచితకు జ్వరం రావడంతో మంచిర్యాలలో సంజీవనీ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించారు. తెల్ల రక్తకణాలు తగ్గి పోవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం రుచితను శుక్రవారం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. రుచిత మృతితో దుబ్బపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకున్నది

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటపల్లి, అక్టోబర్ 13 : కోటపల్లి-చెన్నూర్ 33 కేవీ మరమ్మతులు దృష్ట్యా నేడు కోటపల్లి, నీల్వాయి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఇండ్లపై నుంచి విద్యుత్ తీగలు వేయకండి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

భీమారం,అక్టోబర్ 13 : మా ఇండ్ల పై నుంచి 11 కేవీ విద్యుత్ తీగలను వేయద్దని శుక్రవారం మండల కేంద్రంలోని సుంకరి పల్లెలో గ్రామస్తులు పనులు అడ్డుకున్నారు. ఒక రైస్‌మిల్ యజమాని లాభం కోసం, రైస్‌మిల్ సౌకర్యం కోసం విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారని ఆందోళన చేశారు. ఈ ప్రాంతంలో పెరిగిన చెట్లను నరికారని తెలిపారు. వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసనలో గ్రామస్తులు సెగ్యం కిష్టయ్య, అనపర్తి దేవదాస్, సెగ్యం లింగేశ్, అనపర్తి రాజారాం, జాడి మధుకర్, సెగ్యం మధుకర్,ఎస్ మధుకర్ తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ వేడుకలు

కోటపల్లి, అక్టోబర్ 13 : కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ హరిత ఆధ్వర్యంలో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆడి పాడారు.



కోటపల్లి కేజీబీవీలో బతుకమ్మ పేర్చుతున్న స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు



చెన్నూర్ టౌన్ : బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

**చెన్నూర్‌లో..**

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 13 : చెన్నూర్ పట్టణంలో బొడ్డెమ్మ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల్లో తీరొక్క పూలతో బొడ్డెమ్మలను పేర్చి మహిళలు ఆడిపాడారు. డీజే పాటలకు అనుకూలంగా చప్పట్లు, కోలాటాలతో ఆడిపాడుతూ ఆనందంగా గడిపారు. చప్పట్ల మధ్య బతుకమ్మ పాటలు పాడుతూ సాయంత్రం బొడ్డెమ్మలను పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్థానిక పెద్ద చెరువులో బొడ్డెమ్మలను నిమజ్జనం చేశారు. నైవేద్యాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

గర్మిళ్ల, అక్టోబరు 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలో గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సాగే ప్రశాంత్ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం మంచిర్యాల రైల్వే ఎ క్యాబిన్ సమీపంలో 226 గ్రాములు,రూ.5625వేల రూపాయలు విలువ చేసే గంజాయి ప్యాకెట్‌ను విక్రయిస్తున్నాడనే నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 17న బ్యాడ్మింటన్ జిల్లా, జోనల్ సెలక్షన్స్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 13 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 17న మంచిర్యాలలోని రంగంపేటలోగల బ్యాడ్మింటన్ అకాడమీలో అండర్ – 14, అండర్ – 17 బాల, బాలికల జిల్లా, జోనల్ పోటీల సెలక్షన్స్ నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పరిమళ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు బోనాఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, గత సంవత్సరం ప్రొగ్రెస్ కార్డులతోపాటు నాలుగు ఎలిజిబిలిటీ ఫార్మ్స్‌తో సుధాకర్ సెల్ నంబర్ 98495 05695లో సంప్రదించాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి బాల్క ఫౌండేషన్ చేయూత



కుటుంబ సభ్యులతోమాట్లాడుతున్న వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్ రావు, నాయకులు

కోటపల్లి, అక్టోబర్ 13 : కోటపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రాళ్ల బండి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించగా, బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్, సర్పంచ్ పెద్దింటి పున్నంచంద్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, నాయకులు పడాల రాజబాపు, తనుగుల రాజబాపు తదితరులున్నారు.